సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 24-12-2024

సంపుటి: 20 సంచిక: 230

పేజీలు: 4 వెల: రూ.1


# దెయ్యం చెట్లు..!



- వ్యాపారాలు హరిస్తున్న మోనోకార్పస్
- పాలకొండ రోడ్డు చీకటిమయం
- తొలగించడానికి ముందుకురాని కార్పొరేషన్
- రోడ్డున పడుతున్న కుటుంబాలు ఏటికేడాది పెరుగుదల

దెయ్యం ఉందో లేదో తెలీదుగానీ, ఆ పేరు చెబితే మనకెందుకు భయం? ఎందుకంటే.. చీకట్లో మాత్రమే కనిపించే ఆకారం కాబట్టి. దెయ్యం మనల్ని చంపేస్తాదనే భావన కాబట్టి. చంపేయడానికి తెల్లటి ముసుగు, విరబోసు కున్న జుత్తు, వెనక్కు తిరిగిన పాదాలే ఉండక్కర్లేదు. జడలు విప్పకున్న కొమ్మలు, భూమిలోకి పాతుకుపోయిన వేళ్లు, వెలుగును అడ్డుకుంటున్న ఆకులు ఉన్నా కూడా అది దెయ్యమే.. అది భయమే.. అటువంటి దెయ్యాలతో సహజీవనం చేస్తూ పాలకొండ రోడ్డులో వ్యాపారులు చచ్చిపోతున్నారు.. లేదంటే రోడ్డున పడిపోతున్నారు.

దెయ్యంకంటే భయం మహా చెడ్డదని త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నట్టు వెలుతురు లేక, చీకటిని చీల్చే సూర్యుడు కనపడక స్థానిక పాలకొండ రోడ్డు కునారిల్లిపోతుంది. ఏపుగా పెరిగిన మోనోకార్పస్ చెట్లు ఇక్కడ వ్యాపారుల పీక నొక్కేస్తున్నాయి. ఈ చెట్లు విడుదల చేసే వాయువు వల్ల నిజంగా ఊపిరితిత్తులకు నష్టం ఏమేరకు జరుగుతుందో నిర్ధారించలేదు గానీ, ఏపుగా పెరిగిన ఈ చెట్ల వల్ల ఇక్కడి వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చేశారు. ప్రతీ ఏడాది కనీసం 25 వ్యాపారాలకు తక్కువ లేకుండా దివాలా తీస్తున్నారంటే కారణం ఈ దెయ్యంచెట్లే. అసలే పాలకొండ రోడ్డులో వ్యాపారాలు అంతంత మాత్రం. దీనికి తోడు భారీగా పెరిగిన చెట్లు, దాని నుంచి రోడ్డుకు రెండువైపులా ఏమున్నాయో కనపడని పరిస్థితి వెరసి పాలకొండ రోడ్డంటే ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లడానికి ఒక మార్గమన్న స్థాయికి దిగజారిపోయింది. ఈ చెట్లు తొలగించాలని స్వయంగా రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు చెప్పినా మున్సిపల్ యంత్రాంగం మాత్రం ఇంతవరకు ఒక్క అడుగు ముందుకెయ్యలేదు. ఈలోగా పండగ సీజన్ ముగిసిపోతే ఈ దెయ్యంచెట్ల పుణ్యమాని సంక్రాంతి అయిపోయిన తర్వాత ఈసారి దివాలా తీయడం కాదు.. వ్యాపారస్తులు ప్రాణాలు తీసుకునేట్టున్నారు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పట్టణంలో పాలకొండ రోడ్డు గత వైభవంగా మిగిలిపోనుందా? సిక్కోలు మున్సిపాలిటీ ఉదాసీన వైఖరిని చూస్తుంటే ఇది నిజం చేయడానికే కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తోంది. రోడ్డు మధ్యలో వేసిన డివైడర్‌పై ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్ కళ్లమీద పడకుండా నివారించడానికి వేయాల్సిన చిన్న మొక్కల స్థానంలో ఆరోగ్యానికి హాని కలిగించే మోనో కార్పస్ అనే భయంకర విషప్రభావం చూపే మొక్కలను నాటారు. ఈ చెట్లు ప్రకృతికి, పర్యావరణానికి, ప్రజలకు కలిగించే హాని గురించి ఇప్పటికే లెక్కలేనన్ని సార్లు లెక్కలేనంత మంది అరిచిగీపెట్టి చెప్తున్నప్పటికీ మున్సిపాలిటీ అధికారులకు చీమ కుట్టినట్టయినా అనిపించడం లేదు. ఆ మొక్కలకు ప్రత్యామ్నాయంగా బోగన్‌విలియా లాంటి మొక్కలను పెంచుకోవచ్చు. కాని, ఈ సలహాలను మున్సిపల్ అధికారులు చెవికెక్కించుకోవడం లేదు. కనీసం ఎప్పటికప్పుడు ఈ మొక్కల కొమ్మలు కత్తిరించి, పెద్దగా పెరగకుండా చిన్న ఎత్తులో ఉండే మొక్కలుగా కూడా నిర్వహించడం లేదు. కొమ్మలంటూ కత్తిరిస్తే అది మున్సిపల్ ఎలక్ట్రికల్ పోల్‌కు పక్కనున్న రెండు చెట్లకే పరిమితం చేస్తున్నారు. మున్సిపాలిటీ నిర్లక్ష్యపూరిత నిర్వహణ వల్ల ఎత్తుగా పెరిగిన ఈ వృక్షాలు భూగర్భ జలాలను అత్యంత భారీస్థాయిలో వినియోగించుకుంటాయి. ఈ మొక్కల నిర్వహణను మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా గాలికి వదిలేయడం వల్ల ఏపుగా పెరిగిపోయి, ఈ ప్రాంతంలో సంచరించే స్థానికులకు రాత్రిపూట హార్రర్ సినిమాలను తలపిస్తున్నాయి. ఏపుగా పెరిగిన ఈ వృక్షాల వలన వీధిదీపాలు వెలుగుతున్నప్పటికీ రోడ్లను చీకటిమయం చేసేసాయి. ఆ ప్రాంతంలో ఉన్న దుకాణాల నుంచి వస్తోన్న వెలుతురును కూడా ఈ మొక్కలు కబళించడం వలన ప్రయాణీకులు చిమ్మచీకటిలో తిరుగుతున్నట్టుగా అనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు. అటువైపు ప్రయాణిస్తున్న వారికి డివైడర్‌పైనున్న వృక్షాలు దెయ్యాల చెట్ల మాదిరిగా కనిపిస్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు అటువైపుగా రాకపోకలు సాగించడానికి సాహసించలేకపోతున్నారు. దీంతో వినియోగదారులు రాత్రిపూట అటువైపు వెళ్లడం మానుకుంటున్నారు. పీక్ అవర్స్‌లో బిజినెస్ లేకపోవడంతో చాలా మంది దుకాణదారులు క్రమంగా తమ వ్యాపారాలను జిటి రోడ్డు వైపు తరలించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడుతోంది. జీటీ రోడ్డులో దుకాణాలు అద్దెకు తీసుకోవాలంటే ముందు ఏడు తరాలు అంబానీలో, అదానీలో అయివుండాలి. పాలకొండ రోడ్డులో వ్యాపారస్తులకు ఈ మొక్కలు జీవన్మరణ సమస్యగా మారాయి. ఇప్పటికే ఇవి విడిచిపెట్టిన గాలిని పీల్చి ఊపిరితిత్తుల వ్యాధులతో సతమతం అవుతున్న వ్యాపారస్తులపై ఇప్పుడు వ్యాపారాలు సరిగా సాగక గొడ్డలి వేటు పడుతున్నట్టుగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మొక్కలపై గొడ్డలి వేటు పడితే తప్ప తమ జీవితాలలో ఉషోదయం ఉండదని ఆవేదన చెందుతున్నారు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి, మున్సిపాలిటీ అధికారుల మీద గట్టి వత్తిడిపెడితే కొమ్మలు కత్తిరించి ఊరుకుంటున్నారు. నెలతిరిగే సరికల్లా తిరిగి యధాతథ పరిస్థితికి చేరుకుంటోంది. దాంతో మళ్లీ అదే సమస్యపై రాజకీయ నాయకుల చుట్టూ తిరగలేక, వ్యాపారాలు సరిగా జరగక తీవ్రంగా సతమతమవుతున్నారు. పట్టణంలో అన్ని ప్రాంతాల మాదిరిగానే అటు జిటి రోడ్డులో, ఇటు ఆర్టీసి కాంప్లెక్స్ రోడ్డులో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారితో సమానంగా పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్నప్పటికీ కేవలం మున్సిపాలిటీ అధ్వాన నిర్వహణ వల్ల వ్యాపారాలు సరిగా సాగక కుదేలవుతున్నారు. మరికొద్ది రోజుల్లో పండగ సీజన్ వ్యాపారం పుంజుకోనున్న నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు పూనుకొని పాలకొండ రోడ్డులో డివైడర్‌పైనున్న మొక్కలను తొలగించి ప్రత్యామ్నాయంగా మరేవైనా పొదలను, గుల్మాలను ఏర్పాటుచేయాలని కోరుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం చలించి దీనిపై తగిన చర్యలు తీసుకోకుండా ఇదేవిధమైన ఉదాసీనతను కొనసాగించినట్లయితే పాలకొండ రోడ్డులో వాణిజ్యమంతా ఆవిరడం ఖాయం. ఆ పైన పాలకొండ రోడ్డులో ఒకప్పుడు వ్యాపారం బాగా జరిగేదని చెప్పుకునే ఒక పూర్వకాల వైభవంగా మాత్రమే మిగిలిపోవడం తథ్యం.

# ఘోర రోడ్డు ప్రమాదం

కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన కారు । ముగ్గురు దుర్మరణం । ఇద్దరి పరిస్థితి విషమం




(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

కంచిలి మండలం పెద్ద కొజ్జిరియా జంక్షన్ సమీప జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జైలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే కదిరిశెట్టి సోమేశ్వరరావు(48),ఎం.లావణ్య(43), స్నేహగుప్తా(18) మృతిచెందగా, మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. విశాఖ నుంచి జాజ్పూర్ దుర్గామాత ఆలయ దర్శనానికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

### ప్రమాదంపై మంత్రి ఆరా

కంచిలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. ముగ్గురు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

### స్పందించిన ఇన్‌ఛార్జిమంత్రి

శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




● గెస్ట్ ఎడిటోరియల్

## ప్రజల అంశమా? ప్రభుత్వ పంతమా?

ప్రజాప్రయోజనాలు ఇమిడి ఉన్న ఒక అంశానికి సంచలనత జోడించి, దాన్నొక వీధి తగవుగా మార్చి, నిర్వీర్యం చేయడం పాలకులు అనుసరించే ఒక ఎత్తుగడ. సమాజం తరపు నుంచి వ్యవహరించవలసిన ప్రభుత్వం, తన ఆచరణను కక్షసాధింపుగా, వ్యక్తిగత పంతంగా కనిపించేట్టు చేయడమంటే, ఇక అందులో నుంచి ప్రజాప్రయోజన అంశాలు మాయమైనట్టే. అల్లు అర్జున్ విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం తీరు బాధితులకు న్యాయం జరగడం, భవిష్యత్తులో నివారించడం వంటి లక్ష్యాలను కాక, మరి వేటికో గురిపెట్టినట్టు కనిపిస్తోంది. మార్కెట్‌తో ముడిపడిన వినోద పరిశ్రమ, జనం సాంస్కృతిక ఆవేశాల మీద, సహజాత అభిరుచుల మీద ఆధారపడి వినియోగదారులను సృష్టించుకుంటుంది. ఆ క్రమంలోనే తారలూ అభిమానులూ పుడతారు. ప్రజాప్రతినిధులకు ఓటర్లకు మధ్య ఎంతో కొంత బాధ్యత, ఒప్పందం ఉంటాయి. కానీ సెలబ్రిటీలకు ఫాన్స్‌కు మధ్య మాత్రం అంతా ఏకపక్షమే. ఫాన్స్ అవ్యాజ, బేషరతు అభిమానం సమర్పించుకోవలిసిందే. అందుకు ప్రతిగా తారలు ఏమీ చేయనక్కరలేదు, అవే విలువలను, వీలైతే మరిన్ని హీన విలువలను కొత్తకొత్తగా రీఛార్జ్, రీఇన్ఫోర్స్ చేస్తూ ఉండడం తప్ప. ఫాన్స్ మధ్యలో హీరో, తెర జీవితానికి వాస్తవానికి తేడా లేకుండా సంచరిస్తాడు. దేవుడి పాత్రలు వేసి దేవుణ్ణని, మాఫియా పాత్రవేసి అరివీర భయంకరుణ్ణని భ్రమలో పడతాడు. అందుకే వారికి, హాళ్లలోనే కాదు రోడ్ల మీద కూడా జనం ఎగబడాలి, కిక్కిరిసిపోవాలి, చావులను కోరుకోరు కానీ తొక్కిసలాట జరిగి చొక్కాలు చినిగిపోవాలి. ఈ సన్నివేశాల మీదనే హీరోల మార్కెట్, సినిమాల ఓపెనింగ్స్ ఆధారపడతాయి. ఒక మహిళ మరణానికి, ఆమె కొడుకు ప్రాణాపాయ స్థితికి కారణమైన సంధ్య టాకీస్ తొక్కిసలాట మీద ప్రజలు ఎంతో కలవరంతో ఉద్వేగంతో స్పందించారు, ఇంకా ఆ చర్చ సాగుతూనే ఉంది. అల్లు అర్జున్ అభిమానులు ఒక నైతికమైన సంశయంలో పడిపోయి తమ హీరోను సమర్థించుకోలేక సతమతమయ్యారు. జరిగిన దుర్ఘటనలో అర్జున్‌కు ప్రత్యక్షంగా పరోక్షంగా బాధ్యత ఉంది. అట్లాగని అతను ఒక్కడే బాధ్యుడు అనడం కూడా సరికాదు. ప్రభుత్వం కూడా ఆయన్ను 11వ ముద్దాయిగా మాత్రమే చూపింది. ఈ అంశం మీద సమాజం స్పందన, మానవీయ కోణం నుంచి మొదలై, వివిధ వ్యవస్థల బాధ్యతను చర్చించడం దాకా సాగింది. అర్జున్ భౌతిక ప్రమేయం గురించి కంటే, అతని నైతిక బాధ్యత మీద, అతని కంటి తుడుపు స్పందన మీద జనం పట్టింపు చూపారు. అర్జున్ కానీ, ఆయన సినిమా టీమ్ కానీ, ఆ మాటకు వస్తే, మొత్తం టాలీవుడ్ కానీ ఈ విషాదంలో ఇమిడి ఉన్న వ్యవస్థాగత అమానవీయతకు బాధ్యత తీసుకోవాలి. భారీ బడ్జెట్లు, హీరోల పారితోషికాలు, బెనిఫిట్స్ షోలు, అధిక ధరల టికెట్లు, థియేటర్ల గుత్తాధిపత్యం, అభిమానులను వేడెక్కించిన ప్రీ, పోస్ట్ ఈవెంట్లు.. వీటన్నిటి మీద ఆత్మవిమర్శ చేసుకుని సంస్కరించుకోవాలి. మున్ముందు ఏ తొక్కిసలాటలూ దుర్మరణాలూ జరగవని సమాజానికి హామీ ఇవ్వాలి. బెనిఫిట్ షోలకు భారీ టికెట్లకు అనుమతించిన ప్రభుత్వానికి కూడా బాధ్యత ఉంది. ఈ బాధ్యతల గుర్తింపు, భవిష్యత్తులో వినోద ప్రేక్షకుల భద్రతకు, హక్కులకు గ్యారంటీ అవుతుంది. ప్రభుత్వ చర్యల విశ్వసనీయత కూడా ఇక్కడ చర్చనీయం. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రభుత్వానికి అల్లు అర్జున్‌కు ఎన్నికల తగాదాలున్నాయని, ఆ నేపథ్యంలోనే రేవంత్ ప్రభుత్వం కఠినంగా ఉంటోందని కొందరు, సినీపరిశ్రమను తన దారికి తెచ్చుకోవడానికి వరుస చర్యలు తీసుకుంటోందని సామాజిక మాధ్యమాల్లో గగ్గోలుగా ఉంది. రేపో మాపో ఒప్పందం కుదిరి సుఖాంతం అవుతుంది చూడండన్న జోస్యాలు కూడా వినిపిస్తున్నాయి. ఇటువంటి నిరాధార కథనాలకు, ప్రభుత్వ చర్యలు సమర్థనలుగా కనిపించకూడదు కదా! న్యాయాన్ని అమలుచేయడం కక్షగానో పంతంగానో అనిపించగూడదు కదా? బీఆర్ఎస్ తెలివితక్కువ వైఖరి తీసుకుందని, దానితో ముఖాముఖి కోసం వీరంగం వేయడం ఏమి తెలివి? అల్లు అర్జున్‌కు లాగే, రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా నాసిరకం సలహాదారులు ఉన్నట్టున్నారు! తప్పొప్పులను మీడియా ద్వారా తేల్చే తీర్పరితనం కానీ, ఉన్నట్టుండి మంత్రులు సినిమా విమర్శకులైపోయి నేరగాళ్ల సినిమాలని నిందించడం కానీ ఏ ప్రయోజనమూ నెరవేర్చదు. అధికారపార్టీ అంతా కలిసి లించింగ్ చేస్తున్నట్టు ఎగబడితే, సానుభూతి అర్జున్ మీద పెరుగుతుంది తప్ప ఉపయోగం లేదు. హైకోర్టు బెయిల్ ఇచ్చిన తీరు మీద చాలామందికి భిన్నాభిప్రాయాలున్నాయి. న్యాయపాలన కానీ, నేర విచారణ కానీ మన దేశంలో జరిగే తీరు కొత్తదేమీ కాదు. నేరుగా తుపాకీ కాల్చిన సినిమా హీరోకు అన్ని వ్యవస్థలు కాపుగాసాయి. కోర్టు తగినవిధంగా స్పందించలేదని, మరోపద్ధతిలో శిక్షించాలనుకోవడం యూపీ మార్గం. బుల్డోజర్ లాగే దీన్ని కూడా దిగుమతి చేసుకోవాలనుకోవడం మంచి పద్ధతి కాదు. అల్లు అర్జున్ అయినా, మరే నిందితులైనా, తమ బాధ్యతను తప్పించుకోగూడదు. అలాగే ఆ మేరకు మాత్రమే పర్యవసానం అనుభవించాలి. అంతకు మించిన వేధింపు తగదు! మొత్తం వ్యవహారంలో ముందుకు వచ్చిన ప్రజా పట్టింపు అంశాలు విస్మరణలో పడకూడదు!

## జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీలో రాజుకు స్థానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా కళింగ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజుకుస్థానం దక్కింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఈఓ సెక్రటరీగా వున్న ఈ కమిటీలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, జిల్లా ఎస్పీ, 12మంది సభ్యులు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ కానీ ఎన్జీఓ విభాగం నుండి బి.వి.ఎస్.ఎన్. రాజుకు స్థానం దక్కింది.

## బోడి చదువులు వేస్టు..
# రాత్రికి రాత్రే కోటీశ్వరులైపోవాలి

**గ్రూప్-2కు**
**46.30% మంది హాజరు**

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి రెండు రోజుల పాటు జరిగే రాతపరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా 1368 పరీక్ష కేంద్రాల్లో ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ), పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 5,51,855 మంది దరఖాస్తు చేయగా.. 74.96 శాతం మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని కమిషన్ వెల్లడించింది. పేపర్-1 పరీక్షకు 2,57,981 (46.75%) మంది, పేపర్-2 పరీక్షకు 2,55,490 (46.30%

**'బోడి చదువులు వేస్టు... బుర్రంతా భొంచేస్తూ...'**

ఈ పాట ఎక్కడో విన్నట్టు ఉంది కదా.. ఇప్పుడు అచ్చం ఇలానే ఉంది సమాజంలో. లక్కీ భాస్కర్, పుష్ప ఇవే మనకు ఆదర్శం. కొడితే వెయ్యి కోట్లు కొట్టాలి. అదీ ఒక రోజులో. ఆపై లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి. ఈ మధ్య ఓ స్కూల్లో ఇద్దరు ఎనిమిదో తరగతి పిల్లలు స్కూల్ గోడ దూకి విజయవాడ పారిపోయారు. ఓ రెండు రోజుల్లో పోలీసులకు దొరికారు. లక్కీభాస్కర్ సినిమాలో హీరోలా కోట్లు సంపాదించాలని వారు పారిపోయినటు ఇన్వెస్టిగేషన్‌లో తేలింది. సరే ఇక విషయానికి వస్తే ఒకప్పుడు వైజాగ్, నంద్యాల, కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో, బీసీ స్టడీ సర్కిళ్లలో నెలలు, సంవత్సరాల తరబడి కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తయారయ్యేవారు. వందల్లో వేలల్లో ఉండేవారు. తదేక దీక్షతో ప్రిపేర్ అయ్యేవారు. నిన్న పక్క రాష్ట్రంలో గ్రూప్-2 పరీక్ష జరిగింది. అనేక సంవత్సరాల తర్వాత వచ్చిన అవకాశం. పరీక్షకు హాజరయ్యింది కేవలం 45 శాతం. అంతే కదా?.. నలభై.. యాభై వేల శాలరీ... బోడి ఉద్యోగానికి ఒక పరీక్ష. అదీ రెండు పేపర్లు. పొద్దున్న ఒకటి.. మధ్యాహ్నం ఒకటి. ఇంతసేపు పరీక్ష హాల్‌లో కూర్చోవాలంటే బోర్ కొట్టదా? అంతా ఓపిక ఎక్కడిది? ఇదీ ఇప్పటి యువత ఆలోచన తీరు. పరీక్షలు, ఇంటర్వ్యూలు లేకుండా నేరుగా కలెక్టర్ ఉద్యోగం డైరెక్ట్‌గా ఇచ్చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినా చేస్తారు. నిన్నటి పరీక్ష గురించే కాదు కోచింగ్ సంస్థల్లో పరిస్థితి ఇలాగే వుంది.

ఎవరో కొంతమంది మినహాయించి క్లాసులో కూర్చోవడానికి ఇష్టపడడం లేదు. మరీ మూడు నాలుగు గంటలు క్లాసులైతే ఎలా సార్? అని అడుగుతున్నారట. 'లింక్ ఇవ్వండి. ఇంట్లో నుంచే చూస్తాము' అంటున్నారట. రన్నింగ్ నోట్స్ రాసుకొనే ఓపిక లేదు. పాయింట్స్ పీడీఎఫ్‌లో పంపితే సరిపోతుంది కదా? అంటున్నారట. ఎన్నోఏళ్లుగా నడుస్తున్న సంస్థల్లో విద్యార్థులు లేరు. ఒక్కొక్కటి మూతబడుతున్నాయి. ఇప్పుడు ఢిల్లీ వెళ్లి హాస్టల్ ఉండటం ఒక ఫ్యాషన్. నెలకి సుమారు రూ.40వేలు పైగా ఖర్చు. అవే పాఠాలు ఇక్కడ చెప్తామంటే అవసరంలేదు. ఇదిలా ఉంటే అసలు కాంపిటేటివ్ పరీక్షలకు ఎకనామిక్స్, చరిత్ర, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చెప్పేవారు కరువయ్యారు. ఇంటర్, డిగ్రీ స్థాయిలో కేవలం పది పేజీలు చదివి ఈ సబ్జెక్టులు పాస్ అయి వీరేం సివిల్స్‌కు తయారవుతారు.. లేదా పాఠాలు చెప్తారు.

-సీహెచ్ దుర్గాప్రసాద్

## పోరుబాటకు తరలిరండి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఈనెల 27న వైకాపా తలపెట్టిన పోరుబాట నిరసనలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆమదాలవలసలో ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమని, ఇంకా వీలైతే తగ్గిస్తామని ఎన్నికలముందు అనేక సభల్లో మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ.15వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇది చంద్రబాబు మోసపూరిత పాలనకు నిదర్శనమని రవికుమార్ ఆరోపించారు. వైకాపా హయాంలో ఉన్న కరెంట్ చార్జీలకు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెరిగిన కరెంట్ చార్జీలకు గల తేడాను ప్రజలు కూడా గమనిస్తున్నారన్నారు. గతంలోనూ విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలను అనేక కష్టాలకు గురిచేసిన చరిత్ర చంద్రబాబుదని చెప్పారు. నేడు రాష్ట్రంలో మళ్లీ అదే చంద్రబాబు వల్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోయలేక ప్రజల నడ్డి విరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈనెల 27న తలపెట్టిన వైస్సార్సీపీ పోరుబాట నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. 27న ఉదయం 10గంటలకు ఆమదాలవలస రైల్వే స్టేషన్ దరిలో గల వన్‌వే జంక్షన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు, వివిధ ప్రజా సంఘాలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు. వైకాపా నాయకులు చేపట్టే పోరుబాట నిరసన కార్యక్రమం కూటమి ప్రభుత్వానికి ఒక హెచ్చరికలా నిలిచి విద్యుత్ చార్జీలు తగ్గించే ఆలోచన చేసేలా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జడ్పీ టీసీ సురవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సీనియర్ నాయకులు గురుగు బెల్లి శ్రీనివాసరావు, సువ్వారి నేతాజీ, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇంటెన్స్ రెబల్ స్టోరీ!

గత ఏడాది తమిళంలో ఘనవిజయం సాధించిన 'విడుదల' తెలుగులో కూడా ఓ మోస్తరుగా ఆడింది. ఇప్పుడు దానికి ప్రీక్వెల్ గా తెరకెక్కిన సినిమా.. విడుదల-2. విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో వెట్రిమారన్ రూపొందించిన ఈ చిత్రం.. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:** ఎన్నో ఏళ్ల నుంచి పోలీస్ వ్యవస్థను ముప్పు తిప్పలు పెడుతున్న నక్సలైట్ నాయకుడు పెరుమాళ్ అలియాస్ మాస్టారు (విజయ్ సేతుపతి).. చివరికి ఓ ఆపరేషన్లో పోలీసుల చేతికి చిక్కుతాడు. ఈ ఆపరేషన్లో సాధారణ కానిస్టేబుల్ అయిన కుమరేశన్ (సూరి) కీలక పాత్ర పోషిస్తాడు. మాస్టారును పోలీసుల చెర నుంచి బయటికి తీసుకురావడా నికి అతడి టీం సభ్యులు ప్రణాళిక రచిస్తారు. అదే సమయంలో అధికార వర్గాల్లో మాస్టారును కోర్టులో ప్రొడ్యూస్ చేయాలని కొందరు ప్రయత్నిస్తుంటే.. ఎన్ కౌంటర్ చేయడానికి మరోవైపు రంగం సిద్ధం చేస్తారు. ఇదంతా ఓవైపు నడుస్తుంటే.. అసలు ఈ పెరుమాళ్ ఎవరు.. తన నేపథ్యం ఏంటి.. అతను మాస్టారుగా ఎందుకు మారాడు.. నక్సలైట్ నాయకుడిగా ఎలా ఎదిగాడు.. ఈ నేపథ్యంలో మరోవైపు ఈ కథ నడుస్తుంది. ఆ కథేంటి.. చివరికి మాస్టారు వ్యవహారం ఏ కంచికి చేరింది అన్నదే ఈ చిత్రం.

**కథనం-విశ్లేషణ:** తెలుగులో కొన్నేళ్ల కిందట 'విరాట పర్వం' అనే సినిమా వచ్చింది. వేణు ఉడుగుల ఆ కథను చాలా సిన్సియర్‌గానే తెరకెక్కించాడు. స్వర్ణక్క అనే నక్సలైట్ కథను ఉన్నంతలో ఆసక్తికరంగానే నరేట్ చేశాడు. కానీ అందులో చూపించిన పరిస్థితులు ఇప్పుడు ఎక్కడా లేకపోవడం వల్లో.. తెర మీద చూపించిన విషాదం రుచించకో ప్రేక్షకులు ఆ సినిమాను ఆదరించలేదు. నక్సలైట్లు చురుగ్గా ఉన్న 90వ దశకంలో కృష్ణవంశీ 'సింధూరం' పేరుతో ఓ మంచి సినిమా తీస్తే అది ఆశించిన ఫలితాన్నందుకోలేదు. కానీ 'సింధూరం' ఒక కల్ట్ క్లాసిక్ మూవీగా నిలిచిపోయింది. అన్నిసార్లూ బాక్సాఫీస్ సక్సెస్ మాత్రమే సినిమా స్థాయిని నిర్దేశించదు అనడానికి ఇలాంటి సినిమాలు ఉదాహరణ. ఈ కోవలో తమిళ అనువాద చిత్రం 'విడుదల-2'ను కూడా ఓ గొప్ప ప్రయత్నంగా చెప్పొచ్చు. ఒక నక్సలైట్ నాయకుడి కథను ఎంతో రియలిస్టిగ్గా.. లోతుగా చూపించిన చిత్రమిది. నక్సలైట్లు-ప్రభుత్వం మధ్య ఘర్షణను చాలా బలంగా తెరపై ప్రెజెంట్ చేశాడు వెట్రిమారన్. కాకపోతే నక్సలైట్ల కోణంలో ఏకపక్షంగా ఈ కథను నరేట్ చేయడం.. డాక్యుమెంటరీ స్టయిల్లో కథనం సాగడం వల్ల ఇది అందరికీ రుచిస్తుందా అన్నది ప్రశ్న. కానీ 'విడుదల-2' గొప్ప సినిమా అనడంలో సందేహం లేదు.

గత ఏడాది వచ్చిన 'విడుదల' చిత్రంలో ఒక నక్సలైట్ నాయకుడిని పట్టుకోవడానికి పోలీసులు చేసే పోరాటాన్ని చూపిస్తారు. ఈ క్రమంలో అడవుల్లో నక్సలైట్ ఆపరేషన్లలో పాల్గొనే పోలీసుల కష్టాలను.. అదే సమయంలో పోలీసు ఉన్నతాధికారుల అకృత్యాలు.. రాజకీయ నాయకుల కుట్రలు.. వీటన్నింటి గురించీ చర్చించాడు వెట్రిమారన్. అందులో కథంతా సూరి పోషించిన కుమరేశన్ అనే పోలీస్ కానిస్టేబుల్ పాత్ర కోణంలో నడుస్తుంది. ఆ కథకు అతనే హీరో. ఒక సాధారణ కానిస్టేబుల్ విధి నిర్వహణలో పడే కష్టాలు.. ఎదుర్కొనే సవాళ్ల నేపథ్యంలో కథ చాలా ఆసక్తికరంగా సాగుతుంది. మనం చూడని కొత్త కోణాలెన్నింటినో చూపించాడు వెట్రిమారన్ అందులో. దీనికి తోడు నక్సలైట్ నాయకుడిని పట్టుకునే ఆపరేషన్ నేపథ్యంలో నడిచే పతాక సన్నివేశాలు కూడా అద్భుతంగా అనిపిస్తాయి. రెండో భాగంలో వెట్రిమారన్.. ఆ కథ నుంచి వెనక్కి వెళ్లి నక్సలైట్ నాయకుడి నేపథ్యం మీద ఫోకస్ చేశాడు. అతను ఎలా నక్సలైట్ నాయకుడిగా ఎదిగాడన్నదే ఇందులో ప్రధానాంశం. కానీ ఈ స్టోరీ అనుకున్నంత ఎగ్జైటింగ్ గా అనిపించదు. కుల దురహంకారానికి బలమైన ఓ పేదవాడిని చూసి చలించిపోయి హీరో రెబల్‌గా మారడం.. తర్వాత నక్సలైట్ కావడం.. అతడి వ్యక్తిగత జీవితం.. ఇవన్నీ కూడా రొటీన్ అనిపిస్తాయి. ఆరంభ సన్నివేశాలు బాగున్నా.. పెరుమాళ్ నేపథ్యానికి సంబంధించిన ఎపిసోడ్ మాత్రం చాలా సుదీర్ఘంగా సాగుతుంది. ఈ కథను గంటన్నరకు పైగానే నరేట్ చేశాడు వెట్రిమారన్. మంజు వారియర్ పాత్ర బాగుండి.. ఆమెకు విజయ్ సేతుపతికి మధ్య సాగే మెచ్యూర్డ్ లవ్ స్టోరీ కూడా ఆసక్తి రేకెత్తిస్తుంది కానీ.. మిగతా వ్యవహారమంతా బోర్ కొట్టిస్తుంది. ఎన్నో సినిమాల్లో చూసిన సన్నివేశాలే ఇక్కడా కనిపిస్తాయి.

పెరుమాళ్ బ్యాక్ స్టోరీ అంతా అయ్యాక కానీ 'విడుదల-2' మళ్లీ పట్టాలెక్కదు. పోలీసుల చెర నుంచి అతను తప్పించుకోవడం.. తిరిగి అతణ్ని పట్టుకోవడానికి పోలీసులు చేపట్టే ఆపరేషన్.. ఈ వ్యవహారమంతా చాలా ఎగ్జైటింగ్‌గా నడుస్తుంది. పెరుమాళ్ కథకు ఇచ్చిన ముగింపు కూడా బాగుంది. చివరి 40 నిమిషాలు 'విడుదల-2'కు ఆయువుపట్టు. పోలీసులు-నక్సలైట్లలో ఎవరిది తప్పు.. ఎవరిది ఒప్పు అంటూ చర్చలేమీ పెట్టకుండా.. బ్యాలెన్స్ పాటించే ప్రయత్నం చేయకుండా.. వెట్రిమారన్ 'విడుదల'లో మాదిరే ఇందులోనూ ఒక సైడ్ తీసేసుకున్నాడు. నక్సలైట్ల పక్షపాతిలాగే ఈ కథను నరేట్ చేశాడు. ఐతే ప్రస్తుతం నక్సలైట్ల ఉనికే కనిపించని ఈ రోజుల్లో.. ఈ కథకు ఇప్పటి ప్రేక్షకులకు ఎంతమేర రిలేట్ అవుతారన్నది ప్రశ్నార్థకం. ఇక ఈ కథను డాక్యుమెంటరీ స్టయిల్లో రియలిస్టిగ్గా నరేట్ చేయడం కూడా దీని కమర్షియల్ సక్సెస్ ను పరిమితం చేయొచ్చు. వెట్రిమారన్ శైలి నచ్చేవాళ్లకు.. సీరియస్ గా.. రియలిస్టిగ్గా సాగే సినిమాలను ఇష్టపడే వారికి 'విడుదల-2' బాగానే అనిపిస్తుంది. 'విడుదల' చూసి మెచ్చిన వాళ్లు నిరభ్యంతరంగా ఈ సినిమా చూడొచ్చు.

**నటీనటులు:** వెట్రిమారన్ సినిమాలంటేనే అద్భుతమైన పెర్ఫామెన్సులు చూడొచ్చు. ఇక విజయ్ సేతుపతి లాంటి గొప్ప నటుడు తన సినిమాలో నటిస్తే ఇక చెప్పేదేముంది? ఎక్కడా రవ్వంత కూడా అతి చేయకుండా పాత్రకు తగ్గట్లుగా అద్భుతంగా నటించాడు సేతుపతి. నటిస్తున్నట్లు అనిపించకుండా పాత్రకు తగ్గట్లు బిహేవ్ చేయడంలోనే తన ప్రత్యేకత తెలుస్తుంది. మంజు వారియర్ కూడా గొప్పగా నటించింది. సినిమాలో బెస్ట్ క్యారెక్టర్ తనదే. సూరి మరోసారి మెప్పించాడు. ఇంటెన్స్ పెర్ఫామెన్స్ ఇచ్చాడు. రాఘవేందర్ పాత్రలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పోలీసాఫీసర్ పాత్రలో చేసిన నటుడు పార్ట్-1లో మాదిరే అదరగొట్టేశాడు. ఆముదన్ పాత్రలో చేసిన నటుడు కూడా బాగా నటించాడు. కిషోర్.. గౌతమ్ మీనన్.. మిగతా నటీనటులంతా కూడా బాగా పెర్ఫామ్ చేశారు.




**సాంకేతిక వర్గం:** 'విడుదల-2'లో సాంకేతిక నిపుణులందరూ మంచి ఔట్‌పుట్ ఇచ్చారు. ఇళయరాజా.. పాటలతో పాటు నేపథ్య సంగీతంలోనూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఆయన తన బాణీ చూపించిన చిత్రమిది. వేల్ రాజ్ ఛాయాగ్రహణం సూపర్బ్. ఈ వింటేజ్ కథకు ఎంచుకున్న కలర్ థీమ్ ఒకేసారి మనల్ని 30-40 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిపో తుంది. ఒక డిఫరెంట్ మూడ్ క్రియేట్ చేసి ఈ కథను నరేట్ చేసింది వెట్రిమారన్-వేల్ రాజ్ జోడీ. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. వెట్రిమారన్ మరోసారి రచయితగా.. దర్శకుడిగా తనేంటో చూపించాడు. వామపక్ష భావజాలానికి మద్దతుగా అతను ఒక సైడ్ తీసుకోవడం మీద అభ్యంతరాలు ఉండొచ్చు కానీ.. ఈ కథను ఎంతో నిజాయితీగా తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకుం టుంది. తన కథన శైలి గొప్పగా అనిపిస్తుంది. ప్రతి సన్నివేశంలోనూ తన ముద్ర కనిపిస్తుంది. మాస్టారు బ్యాక్ స్టోరీని ఇంకా ఆసక్తికరంగా తీర్చిదిద్దుకుని ఉండొచ్చు.. దాన్ని మినహాయిస్తే మిగతా సినిమా అంతా వెట్రిమారన్ రచ యితగా-దర్శకుడిగా బలమైన ముద్ర వేశాడు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



ఆ గొంతుకెక్కిన పాట అజరామరమైంది. కహా సే చెడూ ఫసానా.. కహా తమామ్ కరూ.. ఆ గొంతు గురించి చెప్పడానికి.. ఎక్కడ మొదలుపెట్టాలో, ఎక్కడ ముగించాలో తెలియనితనం ఇంకింత వెక్కిరిస్తుంటుంది. హిందీ పాటల రారాజు, లెజెండ్ వంటి విశేషణాలకంటే వినయమే వ్యక్తికుండాల్సిన గొప్ప లక్షణమనేందుకు ఓ చక్కటి ఉదాహరణ మహ్మద్ రఫీ. ఎవరైనా హీరోకు తానో పాట పాడుతున్నాడంటే ముందు ఆ హీరోకు సంబంధించిన హావభావాలు, తన పాత్ర స్వభావం గురించి బాగా తెలుసుకునేవాడు. అందుకే, ఆయనెవరికి పాడితే వారే ఆ పాట పాడినట్టుగా ఒదిగిపోయేది. డిసెంబర్ 25 క్రిస్టమస్ ముందు రోజు, 1924, డిసెంబర్ 24న పుట్టిన మహ్మదీయుడు రఫీ. ఏనాడూ జాతి, మత భేదాలు చూపని వ్యక్తిత్వం. భౌతికంగా మనిషి మన మధ్య లేకపోవచ్చు గానీ.. నేటితో వందేళ్లు పూర్తి చేసుకున్న ఆ మాధుర్యమైన గొంతు పాట ఉన్నంత వరకూ చిరంజీవే. అందుకే, వందేళ్ల ఆ రఫీ స్మాల్ బయోగ్రఫీ!

# బార్బర్ షాపు ఖూనిరాగం నుంచి.. బాలీవుడ్ దాకా!!

సొంతూరు పంజాబ్ అమృత్‌సర్ జిల్లాలోని కోట్ల సుల్తాన్ సింగ్ గ్రామం రఫీది. ఓ బార్బర్ షాపులో పనిచేస్తున్నప్పుడు రఫీ జీవితం మలుపు తిరిగింది. ఫికో అంటూ అంతా షార్ట్ కట్ గా పిల్చుకునే రఫీ.. తన స్కూల్ ముగిశాక పశువులు కాస్తూ జానపద పాటలు హమ్మింగ్ చేసేవాడు. ఆ తర్వాత లాహెూర్ లో తన తండ్రి హాజీ మహమ్మద్ అలీ ఓ దాబా నడపడంతో 1942లో రఫీ కుటుంబం అక్కడికి మారిపోయింది. అక్కడే ఓ క్షౌరశాలలో పనికి కుదిరాడు. రఫీకి పంజాబీ ముస్లిం సూఫీ కవి వారిస్ షా రచించిన విషాదప్రేమ గీతాలైన హీర్ రాంఝ్నా, 17 శతాబ్దానికి చెందిన పంజాబీ పొయెట్ హీర్ సాహిబ్ రచించిన పీలూ గీతాలంటే ఎనలేని మక్కువ. వాటిని బార్బర్ షాప్ లో పనిచేస్తూ కూడా హమ్మింగ్ చేసేవాడు. ఆ మధురమైన గొంతు కూడా ఆ హెయిర్ డ్రెస్సింగ్ షాప్ కు ఎస్సెట్ గా మారింది. అలా ఆ బార్బర్ షాపుకు వచ్చినవాళ్లలో ఒకరు ఆల్ ఇండియా రేడియోలో హెడ్ గా పనిచేస్తున్న జివాన్ లాలూ మట్టూకు రఫీ గొంతు గురించి చెప్పారు. సరే చూద్దామన్నట్టుగా మట్టూ ఓరోజు ఫైన్ మార్నింగ్ తానే కటింగ్ చేయించుకోవడానికి రఫీ పనిచేస్తున్న క్షౌరశాలకు వెళ్లాడు. రోజటిలాగే రఫీ ఆడుతూ పాడుతూ కటింగ్ చేస్తున్నాడు. రఫీ గొంతు విన్న మట్టూ ముగ్ధుడయ్యాడు. ఓరోజు ఆల్ ఇండియా రేడియో స్టేషన్ కు రమ్మని పిల్చి ఆడిషన్ చేశాడు. ఫోక్ సింగర్‌గా ఆలిండియా రేడియో (ఏఐఆర్)లో అవకాశం కల్పించాడు. తన తర్వాత సబార్డినేటైన బుధ్‌సింగ్‌తాన్ కు రఫీని అప్పగించాడు.

తాన్ రఫీకున్న ప్రతిభను గమనించి మరింత పదును పెట్టాడు. ఏఐఆర్ నుంచి రఫీ పాట లాహోర్ ఫిల్మ్ స్టూడియోస్‌కు చేరుకుంది. కొత్త సంగీత దర్శకుడైన శ్యామ్ సుందర్ గుల్ బలోచ్ అనే సినిమా కోసం రఫీ వాయిస్‌తో పంజాబీలో పాట రికార్డ్ చేశాడు. సినిమా ఫ్లాపైంది. కానీ, రఫీ గురించి ప్రచారం పెరిగి.. ఆ విషయం ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ సోదరుడైన ఉస్తాద్ బర్కత్ అలీ ఖాన్ వరకూ వెళ్లింది. ఆయనతో ఏర్పడిన పరిచయంతో రఫీ హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలోని ఖయాల్, తుమ్రీ ప్రక్రియల్లో నైపుణ్యం సాధించాడు. అప్పుడే రఫీకి ముంబైపై మనసు పడింది.

1944 చివరంకంలో ముంబై రైలెక్కాడు. కానీ ఐదేళ్లపాటు ప్లేబ్యాక్ సింగర్ కావాలన్న తన కల సాకారం కాకపోగా.. చాలా మంది తరహాలోనే అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. 1949లో సజాద్ హుస్సేన్ అనే సంగీత దర్శకుడు ఇచ్చిన అవకాశం.. ఆ పాట హిట్ అవ్వడంతో రఫీకి ఓ దారి దొరికింది. ప్లేబ్యాక్ సింగింగ్ లో రఫీకి తొలి గురువు హుసన్ లాల్. పంజాబీ అయిన హుసన్.. సినిమా పాట రికార్డింగ్ కు ముందే తన ఇంటికి ఉదయం నాల్గు గంటలకే రఫీని పిల్చుకుని తంబూరా మీద ప్రాక్టీస్ చేయించేవాడు. శ్యామ్ సుందర్ అనే మ్యూజిక్ డైరెక్టర్ బజార్ అనే సినిమాలో లతామంగేష్కర్ తో కలిసి పాడే డ్యూయెట్ ప్రాక్టీస్ సెషన్‌లో రఫీకి మెంటార్‌గా వ్యవహరించాడు.

ఫిరోజ్ నిజామీ అనే సంగీత దర్శకుడైతే జుగ్ను అనే సినిమా కోసం నూర్జహాన్ తో కలిసి రఫీ పాడే డ్యూయెట్ కోసం పదే పదే రిహార్సల్స్ చేయించాడట. అలా రఫీ ఆమెతో కలిసిన యహా బద్లా వఫా కా బేవఫా కే సివా క్యా హై పాట ఆ తర్వాత సూపర్ డూపర్ హిట్టైంది. రఫీ స్నేహశీలి. తన ముఖం ఎప్పుడూ చిరుదరహాసంతో పలకరిస్తుంది. అలాంటి రఫీ 1947 విభజన తర్వాత మాత్రం హర్టయ్యాడు. ఎక్ దిల్ కే తుక్డే హజార్ హుయే కోయి హయా గిరా కోయి వహా గిరా అంటూ పాడిన ఆ భావోద్వేగ గీతం వెంటాడేది. మహాత్మాగాంధీ హత్యకు గురైనప్పుడు కూడా సునో సునో ఏ దునియా వాలో.. బాపూకీ యే అమర్ కహానీ అంటూ పాడిన పాటా కదిలించేది. రఫీ గొంతులో భావోద్వేగాల్ని బలంగా పలికించి కనెక్టైన ఈ రెండు పాటలూ హుసన్ లాల్, భగత్ రామ్ ద్వయం కలిసి కంపోజ్ చేసినవి.

నౌషాద్ అనే మరో మ్యూజికల్ మెజిషియన్ చేతిలో పడ్డాక రఫీ గొంతు మరింత మాంత్రికంగా మారింది. యే జిందగీ కే మేలే దునియా మే కమ్ నా హెూంగే అఫ్సోస్ హమ్ నా హెూంగే అంటూ 1948లో మేళా కోసం పాడిన పాట, 1949లో దులారీ కోసం పాడిన సుహానీ రాత్ ఢల్ చుకీ నా జానే తుమ్ కబ్ ఆవోగే గీతం.. అలాగే, దీదార్, బైజు బావ్రా, అమర్ వంటి సినిమాల్లోని పాటలన్నీ రఫీని మరింత అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాయి.

అలా రఫీ గొంతుకు మదన్ మోహన్, హన్స్ రాజ్ బెహ్ల్, శ్యాంసుందర్, నౌషాద్, అల్లారఖా ఖురేషీ, ఖయ్యామ్, ఓపీ నయ్యర్, ఎస్. మొహిందర్, సర్దుల్ సింగ్ క్వాత్రాతో సహా.. పంజాబీ సంగీత దర్శకులెందరో ఫిదా అయిపోయారు.

1980లో మరణించిన రఫీ వెళ్లిపోయి 44 సంవత్సరాలవుతున్నా ఆయన గొంతులో మాధుర్యం.. ఆయన్నెప్పుడూ చిరంజీవిగా నిల్పేది. వివిధ భారతి, ఆల్ ఇండియా రేడియో ఉర్దూ బులెటిన్స్ లోనూ రఫీ పాటల పూదోటలు ఓ నోస్టాల్జియా.

రఫీది స్నేహగుణం, మృదుస్వభావం. రెమ్యునరేషన్ విషయంలో కూడా వారి వారి పరిస్థితులను బట్టే తీసుకునేవాడు. కానీ, ఏ పాటైనా మనసు పెట్టే పాడేవాడు. అలనాటి సంగీత దిగ్గజం ఖయ్యాం.. ఇన్సాఫ్ కీ షకల్ మే ఏక్ ఫరిష్తా థాయ్.. రఫీ సాహబ్ అనేవాడు. రఫీ నిరాడంబరత చూస్తే మానవుడి వేషంలో ఉన్న దేవదూతలా అనిపిస్తాడని. తన విజయానికి ఆ దేవుడు, ప్రజల అభిమానమే కారణమనే నిరాడంబర నిగర్వి రఫీ.

ఓపాట అర్థాన్ని దర్శకుడు, సంగీత దర్శకుడు, గీత రచయిత ఇందరి కోణంలో అర్థం చేసుకుని వారందరినీ మెప్పించే విధంగా పాడటం రఫీలో మాత్రమే చూశానన్నాడు మన్నాడే. పాడటం ఓ వృత్తి మాత్రమే అయితే కన్నుమూసి 44 ఏళ్ల తర్వాత కూడా లోకమంతా రఫీని స్మరించుకునేవారు కాకపోవచ్చునేమో! కానీ, పాటంటే తనకున్న అభిరుచే తన అభిమానులు ఇవాల్టికీ నెమరు వేసుకుని గుర్తు చేసుకునేలా నిలబెట్టింది.

1970వ దశకంలో కిషోర్ కుమార్ ఎంట్రీతో ఒకానొక సమయంలో ఇక తాను అంతగా పాడలేకపోవచ్చునేమోనన్న ఒకింత సందేహం రఫీలోనూ ఆవహించిందట. కానీ, పాట పట్ల తనకున్న అంకితభావం తనను దూకుడు ప్రదర్శిస్తున్న కిషోర్ తోనూ సమాంతరంగా నడిపించింది. కొన్ని పాటలు రఫీ మాత్రమే పాడాలనేలా నిల్చిపోయాయి. తేరీ గాలియో మే నా రఖేంగే అనే పాటతో పాటు.. అప్నీ ఆంఖోంమే బాసా కర్ వంటి గీతం ఆల్ టైం ఫేవరేట్ సాంగ్స్ గా గుర్తుండిపోయాయి.

కిషోర్, ముఖేష్ వంటి మేటి గాయకులతో పాటు.. ఇవాల్టి బాలీవుడ్ సింగర్స్ వరకూ ఎందరితోనూ పాటల ప్రయాణం చేసిన లతా మంగేష్కర్ కూడా రఫీ ఇష్ట గాయకుడు. ఏ పాట పాడినా రఫీ స్వరస్థానం ఏ మాత్రం అటూ ఇటుగా ఉండేది కాదంటూ పలుమార్లు తెలిసినవాళ్లతో చెప్పేదట లత. పెర్ఫెక్షనిస్ట్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఇవాల్టి బాలీవుడ్ టాప్ సింగర్ సోనూనిగమ్ వంటి ఏకలవ్యులు ఓ ద్రోణాచార్యుడిలా రఫీని భావించేవారంటే.. ఆ పాట ఎంత ప్రభావవంతమైందో ప్రత్యేకంగా చెప్పాలా..?

కిషోర్ పై ఇందిర ప్రభుత్వం ఎమర్జెన్సీ సమయంలో బినాకా గీత్ మాలతో పాటు.. దూరదర్శన్ లోనూ నిషేధం విధిస్తే.. రఫీ వద్దకు వచ్చి కొందరు ఇదే సమయం ఉపయోగించుకోండి అంటూ రఫీని ఉసిగొల్పే ప్రయత్నం చేశారు. అప్పుడే ఆరాధన పెద్ద హిట్టై కిషోర్ పేరు మార్మోగుతున్న సమయంలో నిషేధం ఎదుర్కొంటున్న సమయమది. కానీ, రఫీ విలక్షణమైన వ్యక్తిత్వం కల్గినవాడు. చాడీలు చెప్పేవారి మాటలు విని ఏం మాట్లాడకుండా ఊరుకున్నాడు. కానీ, ఢిల్లీ వెళ్లాడు. కిషోర్ పై కోపంతో రగిలిపోతున్న సంజయ్ గాంధీని కలిశాడు. కిషోర్ పై బ్యాన్ ఎత్తేయండి.. మీకు ఒకటి కాదు.. పది ప్రోగ్రామ్స్ చేసిస్తానని మాటిచ్చాడు. నౌషాద్ తో కలిసి వెంటనే దూరదర్శన్‌లో నాటి ఇందిర ప్రభుత్వ 20 సూత్రాల పథకానికనుకూలంగా ప్రోగ్రామ్ ఇచ్చాడు. వెంటనే కిషోర్‌పై అప్పుడు బ్యాన్ ఎత్తేశారు. అదీ రఫీ అంటే!

రఫీ పనైపోయిందంటూ నాడు రాతలు రాసిన పత్రికలను ఏకి పారేస్తూ కిషోర్ కుమార్ కూడా ప్రెస్మీట్ పెట్టి హెచ్చరించాడు. అలా కిషోర్ కుమార్, రఫీ స్నేహబంధం రామ్-రహీమ్ అన్నట్టుగా సాగింది.

మంచి సృజనాత్మకుడు కావాలంటే మొదటగా మంచి మనిషై ఉండాలనేవారు హీరో దిలీప్ కుమార్ రఫీని ఉదాహరణగా చెబుతూ. పాటగాడిగానే కాదు సహృదయమైన వ్యక్తిగా కూడా తన వ్యక్తిత్వంతోనూ చెరగని ముద్ర వేసి వెళ్లిపోయిన వందేళ్ల పాట రఫీ.

**అభి నా జావో చోడ్ కర్.. కే దిల్ అభీ భరా నహి!**

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## కాలువలను తెరిపించండి

(సత్యంన్యూస్ కొత్తూరు)

కొత్తూరు మండలం నివగాం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉండవలసిన కాలువలు కప్పుడయ్యాయి. వాటిని తెరిపించాల్సిన అధికారులు, నాయకులు నిద్ర అవస్థలో ఉన్నారా? అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ఇది పాలకుల నిర్లక్ష్యమా ప్రజల నిర్లక్ష్యమా? అంటూ ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని ఏళ్లుగా ఇదే దుస్థితి ఏర్పడింది. దీని వలన పాఠశాలలకు పోయే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు ఇప్పటికైనా దీనిపై స్పందించి అధికారులు తగు చర్యలు తీసుకుంటారని ప్రయాణికులు కోరుతున్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666




## నిరుపేద రోగులకు వి ఫర్ నీడీ ఆర్థిక సాయం

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న కోటబొమ్మాళి మండలం లకిందిడ్డి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని టి.విద్యావతి (13) వైద్య ఖర్చులకు రూ10వేలు, షుగర్ కారణంగా కుడికాలును కోల్పోయిన సంతబొమ్మాళి మండలం, వల్లెవలస గ్రామానికి చెందిన అల్లం కోటి కుటుంబానికి రూ 10,000 లను వి ఫర్ నీడీ, యుఎస్ఎ సంస్థ అందించింది. ఈ సహాయాన్ని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలీ. అప్పన్న, పాకాల జగదీశ్‌లు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వ్యవస్థలను బతికించడం కోసమే...

(సత్యంన్యూస్, పాతపట్నం)



కార్పొరేట్ వ్యవస్థలను బతికించడం కోసం కూటమి ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈమేరకు సోమవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యలో అనేక సంస్కరణలు తెచ్చి తనదంటూ ఒక మంచి శైలిలో పిల్లల భవిష్యత్తు కోసమని, పేదరికాన్ని నిర్మూలించాలని మహిళలను సాధికారత దిశగా వైకాపా పాలన సాగించిందన్నారు. నాడు-నేడు క్రింద ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు రూపురేఖలు మార్చారన్నారు. నాడు-నేడు వలన పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు వివిధ చర్యలను చేపట్టడం ద్వారా అన్ని పాఠశాలల్లో అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి, డ్రాపౌట్ రేటును తగ్గించడానికి చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి తల్లికి వందనం అంటూ అందజేస్తామని తప్పుడు వాగ్దానాలతో తప్పుడు ప్రచారంతో అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని విమర్శించారు.

## ప్రకృతి వ్యవసాయమే మేలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబించడం వలన అందరికీ మంచి ఆహార పదార్థాలను అందించే వీలు కలుగుతుందని ప్రముఖ వైద్యులు కె.అమ్మన్నాయుడు పేర్కొన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భముగా వ్యవసాయశాఖ ,ఆంధ్రప్రదేశ్ కామ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్, శ్రీశ్రీ వ్యవసాయ విభాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీచర్ కో-ఆర్డినేటర్ దార్లపూడి రవి ఆధ్వర్యంలో 12మంది ఆదర్శ, వినూత్న రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అమ్మన్నాయుడు మాట్లాడుతూ రైతులు కూడా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కో-ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ విధానాలు, దేశీవిత్తనాల సమీకరణ, జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ భవాని శంకర్, డీపీఎం రేవతి, ఎఫ్‌టీసీ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



## ఏసుక్రీస్తు జీవితం స్ఫూర్తిదాయకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏసుప్రభువు జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ మానవత్వమే ప్రజలందరి మతం కావాలని, ఏ మత సందేశమైన సోదర భావాన్ని, సమాజ శ్రేయస్సు ను కాంక్షించేదిగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. ఈ వేడుకల్లో మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ సాగరిక, శివ సురేంద్ర,డా. అమూల్య మరియు హెచ్ఆర్ దిలీప్, వెంకట్,మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.



నేరాలకు అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశ్యంతో నిరంతర నిఘాలో భాగంగా జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో పోలీసులు డ్రోన్లు ఏర్పాటుచేసి అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా గంజాయి వినియోగం, పేకాట శిబిరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించి వారిపై నిఘా పెడుతున్నారు. ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు అరికట్టేందుకు డ్రోన్‌లతో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

– సత్యంన్యూస్, రణస్థలం


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ విద్యార్థి గణితంపై పట్టు సాధించాలని ఠాగూర్ స్కూల్ డైరెక్టర్ సాలిహుండం రవికుమార్ అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతి, క్రిస్మస్ సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులు తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన వెలికితీయాలనీ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ బెహరా శ్రీదేవి శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. కరెస్పాండంట్ పి.సత్తిబాబు, గణిత ఉపాధ్యాయులు శ్రీదేవి, సీతారత్నం, చందు, హరిత, వైస్ ప్రిన్సిపాల్ చూడామణి లావణ్య, హైస్కూల్ ఇన్‌ఛార్జి సీతారాం, ఎలిమెంట్రీ స్కూల్ ఇన్‌ఛార్జి రాజేశ్వరి, రోజా, గుణ ప్రియ, దీపిక, రమా శైలజ, సునీత పాల్గొన్నారు. చిన్నారులు క్రీస్తు వేషధారణతో అలరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

## దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశభవిష్యత్తు నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల రేజోస్ 2కె 2024 సక్సెస్ మీట్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధనకు పట్టుదల, క్రమశిక్షణతో చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైతే తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవిస్తారో వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలదొక్కుకోగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటి, ఐఐటి, పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 18 మందికి రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బరాటం చక్రవర్తి, సీఏవో రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన కార్యక్రమాలు అలరించాయి.



## అగ్నిప్రమాద బాధితురాలికి సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గోల్కొండరేవువీధిలో నివాసముంటున్న పేద ముస్లిం ఫాతిమా బేగం ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం కాలిపోయింది. ప్రమాదములో సర్వం కోల్పోవడంతో మంగళవారం జామియా మసీదు కమిటీ, అలగే జామియా మసీదు జమాత్, అలే హాదీస్ మసీదు, జిల్లా టీడీపీ మైనారిటీ నాయకులు, అన్ని మసీదుల జమాత్ వారు కలిసి సాయమందించారు. నిత్యావసర సామగ్రి అయిన బియ్యం, గోధుమ, పప్పుదినుసులు, నూనె, పంచదార, కాయగూరలు, బట్టలు, కొంత నగదు బాధిత కుటుంబానికి అందజేశారు. జామియా మసీదు ప్రెసిడెంట్ మహిబుల్లా ఖాన్, వైస్ ప్రెసిడెంట్ హాజీ భయ్యా, సెక్రటరీ అక్బర్ బాషా మాట్లాడుతూ దాతలు, మానవతావాదులు ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాజీ అమీరుల్లా బేగ్, హాజీ షాన్వాజ్, హాజీ యాసిన్, అబ్దుల్, డెంటల్ రఫీ, అమీర్, ఇర్ఫన్ బాషా, పర్వేజ్, బహదూర్ జానీ, జిల్లా టీడీపీ మైనార్టీ నాయకులు ముబారక్, షాను భాయ్, రోషన్ బాషా, సయ్యద్ షఫీ పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్ఎఫ్ఐ నేతలు పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నగరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 43వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఫ్లాష్ మాప్స్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగంలో ఉండే సమస్యలపై విద్యార్థుల హక్కుల కోసం మాత్రమే కాకుండా సమాజాన్ని చైతన్యపరిచేందుకు సామాజిక స్పృహ కలిగిన సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. ప్రభుత్వ రంగ సమస్యలు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నగరంలో ముఖ్యమైన కూడళ్ల వద్ద డాన్స్ కార్యక్రమం ద్వారా సమాజాన్ని చైతన్యపరిచే కార్యక్రమాలు చేన్నామన్నారు. నేటి సమాజంలో మాదకద్రవ్యాల వాడకం, యువత మత్తు బారిన పడడం బాధాకరమన్నారు. విద్యార్థులను చైతన్యపరిచేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, చిన్నారావు, దివ్య తదితరులు పాల్గొన్నారు.



## ధ్యానం ద్వారా ఒత్తిడిని అధిగమించాలి



(సత్యంన్యూస్, పొందూరు)

ధ్యానం చేయడం ద్వారా దుఃఖస్థితి నుంచి ఆనందకరమైన స్థితిని చేరుకోడానికి, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని ఏకం క్షేత్రం (వరదయ్య పాలెం) ప్రతినిధి చంద్రశేఖరదాసాజీ అన్నారు. మంగళవారం స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఏకం అనుగ్రహ ఆధ్యాత్మిక జాగృతి కార్యక్రమంలో దాసాజీ పాల్గొని మార్గదర్శనం చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం నిశ్చలమైన ప్రార్ధన దోహదం చేస్తుందన్నారు. ఐశ్వర్యమంటే ధనం ఒక్కటే కాదని, మన స్నేహితులు, శ్రేయోభిలాషులు కూడా సంపద కిందనే వస్తారనే సత్యాన్ని గ్రహించాలని కోరారు. ధ్యానం కేవలం ఏడు నిమిషాలు చేస్తే సరిపోతుందని, సెరీన్ మైండ్‌లో అయితే మూడు నిమిషాలు చాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి సాధకులు, ధార్మిక సేవకులు పాల్గొన్నారు.

# పశుదాణా కుంభకోణంలో కీలక పాత్రధారికి జేడీ పోస్టు..!

- శ్రీకాకుళం ఇన్‌ఛార్జిగా వచ్చిన రాజగోపాల్
- ఇప్పటికీ లోకాయుక్తలో ఆయనపై కొనసాగుతున్న విచారణ

సత్యంన్యూస్, శ్రీకాకుళం

పశుసంవర్ధక శాఖ జేడీగా బొబ్బిలి డీడీ కె.రాజగోపాలరావుకు పోస్టింగ్ ఇస్తూ శాఖ డైరెక్టర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. రాజగోపాలరావుకు పోస్టింగ్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా పశుసంర్ధక శాఖలో జరిగిన దాణా రూ.11కోట్లు కుంభకోణంలో రాజగోపాలరావుపైనా అభియోగాలున్నాయి. దాణా కుంభకోణంపై లోకాయుక్తకు అందిన ఫిర్యాదుపై 2587/2023తో కేసునమోదై ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికీ లోకాయుక్తలో కేసు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఈ కేసులో రాజగోపాల్ ఎ2గా ఉన్నట్టు శాఖలోనే చర్చ సాగుతోంది. దీంతో పాటు సొంత జిల్లాలో జేడీ ఇన్‌ఛార్జిగా పోస్టింగ్ ఇవ్వకూడదన్న నిబంధనలను పక్కన పెట్టి ఉత్తర్వులు జారీ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో నలుగురు సీనియర్ అధికారులు ఉన్నా, వారిని పక్కన పెట్టి రాజగోపాలరావుకు పోస్టింగ్ ఇవ్వడం పశుసంర్ధక శాఖలో అధికారులు చర్చించుకుంటున్నారు. డీడీ హోదాల్లో పనిచేస్తున్న రామ్మోహన్, జయరాజ్, మనోజ్ కుమార్, సూర్యప్రకాష్ ఉన్నారు. వీరంతా జేడీ ఇన్‌ఛార్జిలుగా నియమించే అవకాశం ఉన్నా, వీరి పేర్లను పరిశీలనలోకి తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజగోపాలరావు గతంలో ఏడీగా ఇక్కడే పనిచేశారు. ప్రస్తుతం జేడీగా ఉన్న మురళీ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన్ని బలవంతంగా సెలవుపై వెళ్లిపోవాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఆయన్ను సెలవుపై పంపించి రాజగోపాలరావును ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్టు భోగట్టా. రాజగోపాలరావును ఆగమేఘాలపై జేడీ ఇన్‌ఛార్జిగా నియమించడానికి పశుదాణా పేరుతో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.11కోట్లు కుంభకోణం వ్యవహారం వెలుగులోకి రాకుండా రికార్డులు తారుమారు చేయడానికి ప్రణాళిక వేశారని ఆరోపణలు ఉన్నాయి. పశుసంవర్ధక శాఖలో రూ.11 కోట్లు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు గోల్‌మాల్ అయినట్టు దళిత సంఘాల నాయకులు ఇనప రాజారావు గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జేసీ స్పందిస్తూ ఆర్డీవో, వ్యవసాయశాఖ జేడీ, పశుసంవర్ధక శాఖ జేడీలతో ఒక కమిటీని వేసి సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో వ్యవహారం వెలుగు చూడకుండా డైరెక్టర్ స్థాయిలోని మంతనాలు జరిపి రాజగోపాలరావును జేడీ ఇన్‌ఛార్జిగా వేసి జేసీకి ఇవ్వాల్సిన నివేదికను అనుకూలంగా మార్చేందుకే ఈ ప్రయత్నాలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజగోపాలరావుపై సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించినట్టు ఆరోపణలు ఉండడంతో జేడీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు ఎలా అప్పగిస్తారని దళిత సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి విన్నవించడానికి సిద్ధమవుతున్నారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.11కోట్లు పశుదాణా పేరుతో పక్కదారి పట్టించిన వైనం వెలుగులోకి రావాలంటే రాజగోపాలరావును తప్పించాలని దళిత సంఘాల నాయకులు కలెక్టర్‌ను కోరనున్నారు.

## రిసోర్స్‌పర్సన్‌గా భమిడిపాటి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈ నెల 28,29 తేదీలలో విజయవాడలో జరగనున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో జరిగే కథ, నవల, వ్యాసం ప్రక్రియల్లో యువతకు శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో భమిడిపాటి గౌరీశంకర్ రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానాన్ని సదస్సు నిర్వహకులు ఆయనకు పంపించారు. గౌరీశంకర్ గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పని చేస్తున్నారు. ఇంతవరకు 150 కథలు రాశారు. ఏడు కథా సంకలనాలు సింగపూర్‌కు చెందిన కస్తూరి ప్రింటర్స్ ముద్రించారు. ఇవి ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి వాటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, రచయితల వేదిక అధ్యక్షులు సదాశివుని కృష్ణ తదితరులు అభినందించారు.

## పిల్లల తరగతి పాఠాల్లో ఉత్తరాంధ్రకు అన్యాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పదవ తరగతి తెలుగు వాచకంలో ఉత్తరాంధ్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన 'తప్పెటగుళ్లు', ప్రపంచ ప్రసిద్ధి చెందిన బౌద్ధక్షేత్రం 'శాలిహుండం' వంటి అంశాలను తొలగించడం అన్యాయమని ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు అన్నారు. ఇటువంటి నిర్ణయాలు నేటికీ ఉత్తరాంధ్రపై పాలకుల నిర్లక్ష్య, వివక్ష వైఖరిని తెలియజేస్తాయన్నారు. ఈమేరకు తొలగించిన అంశాలను తక్షణం పాఠాల్లో చేర్చాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఉత్తరాంధ్ర మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. ఉత్తరాంధ్రలోని పలు సంఘాలు ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తేవాలన్నారు. ఏకపక్షంగా ఇటువంటి నిర్ణయాలు తీసుకున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి అనాలోచిత నిర్ణయాల వల్ల ఒక ప్రాంత చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు తెలియకుండాపోయే ప్రమాదం ఉందన్నారు.

## విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యత పెరగాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజంలో ఆర్థిక అక్షరాస్యత లేదని, అది విద్యార్థి దశ నుంచే మొదలు కావాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎంవీ తిలక్ అన్నారు. స్థానిక అంధవరపు వరహా నరసింహం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు ఆర్థిక అక్షరాస్యతను తెలుసుకున్ననాడే తన ఆర్థిక అభివృద్ధిని సాధించగలరని అన్నారు. సుమారు రు.37,500 విలువైన కుర్చీలను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రామలక్ష్మణ బ్రాంచ్ మేనేజర్ పి.ఇందిరాప్రియదర్శిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఇందిరామణి, ఆఫీస్ సిబ్బంది మురళీకృష్ణ, సంతోషి, సాయిశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీవీఎంసీ మెంబర్‌గా వాబ యోగి

(సత్యంన్యూస్, నరసన్నపేట)



శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా సారవకోట మండలానికి చెందిన ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగిని ఎంపిక చేస్తూ ఇచ్చిన కలెక్టర్ ఉత్తర్వులు మంగళవారం జిల్లా సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో తీసుకున్నారు. ఈ సందర్భంగా యోగి మాట్లాడుతూ ఆదివాసీ, దళిత సామాజిక వర్గానికి చేసిన సేవను గుర్తిస్తూ తనను ఎంపిక చేయడం పట్ల కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసి ప్రజల కోసం మరిన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వాబ యోగి ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఎంపిక పట్ల సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, చిన్నాల వెంకటసత్య నారాయణ, ఆదివాసి సంక్షేమ పరిషత్ కమిటీ సభ్యులు పడాల మాదయ్య, జిల్లా అధ్యక్షులు గురడి అప్పన్న, జిల్లా కార్యదర్శి సింహాచలం, గణేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## స్థల సేకరణ జీవో పునరుద్ధరణకు సహకరిస్తా



(సత్యంన్యూస్, విజయనగరం)

గతంలో శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సంక్షేమ సేవాసంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన స్థల జీవోని పునరుద్ధరించడానికి సహకరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విలను శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు నాయకుల బృందం కోరింది. శ్రీకాకుళం నుంచి తూర్పు కాపు ప్రతినిధి బృందం సోమవారం సాయంత్రం విజయనగరంలోని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుంది. వారి విన్నపానికి స్పందించిన మంత్రి ఈ ప్రయత్నంలో తాను సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోని పరిశీలించి పాక్షిక మార్పులతో ఈ జీవోను పునరుద్ధరించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రతినిధి బృంద సభ్యులు పూర్తి వివరాలను తెలిపి, జీవో ప్రతులను, వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. అనంతరం చైర్మన్ ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు కార్పొరేషన్ పాలవలస యశస్విని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఆమె కూడా ఈ వినతి పట్ల సానుకూలంగా స్పందిస్తూ తాము మంత్రి శ్రీనివాస్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రతినిధి బృందం ఆమెకు కూడా ప్రత్యేకంగా అప్పటి జీవో కాపీలను, వినతి పత్రాన్ని అందజేసింది.

బృందంలో ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథ నాయుడు, కొమ్ము రమణమూర్తి, వాన కృష్ణ చంద్, కొండాల గణేష్, కద్దాల శ్యామసుందర్, కరణం శ్రీనివాస్, దన్నాన లక్ష్మున్నాయుడు, పీఎస్ఆర్ నాయుడు తదితరులు ఉన్నారు.

## శర్వాణిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వాణి అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి వ్యక్తిని సత్పౌరులుగా తీర్చిదిద్దే పవిత్ర వాక్యాలని, ప్రతి మతంలో ఉన్న మంచిని గ్రహించి ఆచరించాలని క్రీస్తు పది ఆజ్ఞలు మానవ జీవితాన్ని తీర్చిదిద్దగలిగే సువర్ణసోపానాలని అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ క్రీస్తు బోధించిన విధంగా తల్లిదండ్రులే కనిపించే దేవుళ్లని, వారి మాటలను గౌరవించినవారే సమాజంలో ఉన్నత స్థానాన్ని అలంకరించి సమాజంతో గౌరవించబడతారన్నారు. విద్యార్థుల శాంతాక్లాజ్ వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్‌కు మార్గం చూపించండి

(సత్యంన్యూస్, టెక్కలి)



ఎన్టీఆర్ నగర్ కాలనీకి పోలీస్ స్టేషన్ వెనుక భాగం నుంచి రోడ్డు లేక అత్యవసర సమయంలో 108 వాహనం ఎన్టీఆర్ నగర్ లోపలికి రావడానికి ఇబ్బందికరంగా ఉందని ఎన్టీఆర్ నగర్ మహిళలు తెలిపారు. కాలనీకి రోడ్డు వేయాలని కోరుతూ మంగళవారం నినాదాలు చేశారు. గత ప్రభుత్వం హయాంలో ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులను కలిసినా సమస్యకు పరిష్కారం దొరకలేదని వాపోయారు. ఇకనైనా స్థానిక నాయకులు స్పందించి కూటమి ప్రభుత్వం ద్వారా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతోనైనా రోడ్డు మార్గం చూపాలని వారు కోరారు. కాలనీ ఏర్పడి 30 ఏళ్లు గడుస్తున్న సరైన రోడ్డు మార్గం లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో ఆదిత్య కల్యాణ మండపం పక్కనుంచి గ్రావెల్ రోడ్డు ఉండేదని, ఈ మార్గాన్ని దేవదాయ శాఖ కంచె వేసిందని, కొంతకాలం పోలీస్ స్టేషన్ పక్కనుంచి మార్గం ఉండేదని, ఆ మార్గాన్ని కూడా పోలీసు శాఖ కంచె వేయడంతో స్కూలుకు వెళ్లే పిల్లలు, హాస్పిటల్‌కి వెళ్లే రోగులు, మార్కెట్‌కి వెళ్లే మహిళలు చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. ఈ సమస్యకు పరిస్కారం చూపాలని వారు కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.